క్లుప్తంగా

ఆనంద ఆశ్రమాన్ని సందర్శించిన మఠాధిపతి


భక్తులతో మాట్లాడుతున్న శివకుమార్‌స్వామి

దొనకొండ: ప్రముఖ పుణ్యక్షేత్రం కడప జిల్లా కందిమల్లాయ బ్రహ్మంగారి మఠానికి సంబంధించి బ్రహ్మంగారి మనవరాలు ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి వీర శివకుమార్‌స్వామి శుక్రవారం ఆనంద ఆశ్రమాన్ని సందర్శించారు. బ్రహ్మంగారి మఠం పక్కనే జగజ్జీవని శ్రీ ఈశ్వరీదేవి మఠం 275 సంవత్సరాల క్రితం నిర్మితమైందని వీర శివకుమార్‌స్వామి తెలిపారు. ఇప్పుడు ఈశ్వరీదేవి మఠం శిథిలావస్థకు చేరిందని, ఆ మఠం పునరుద్ధరణ చేయాలని, పునః నిర్మాణంలో భక్తులు భాగస్వామ్యం కావాలని కోరారు. నిర్మాణానికి విరాళాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఆనంద ఆశ్రమం భైరవానంద స్వామి, ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కుందుర్తి ఆంజనేయాచారి, భక్తులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో బాధితులకు రిలీఫ్ మంజూరు


బాధితులకు రిలీఫ్ ఆర్డర్ అందజేస్తున్న అంజయ్య

తాళ్లూరు: కులం పేరుతో దూషించిన కేసులో బాధితులకు రిలీఫ్ నగదు మంజూరైంది. వివరాలు..మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన ఆబోతు విమలమ్మ, ఆమె భర్త వెంకటేశ్వర్లు ఎస్సీ, ఎస్టీ కేసులో బాధితులు. వీరికి రూ.9.50 లక్షలు దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు పోరాటంతో ప్రభుత్వం మంజూరు చేసినట్లు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య శుక్రవారం తెలిపారు. గత సంవత్సరం దళితులైన వీరు తమ పట్టా భూమిలో పంట సాగు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ఆలోకం హరిబాబు, చిన్నమ్మాయి అనే అగ్రకులస్తులు వారి పంట నష్ట పరచడంతో పాటు కులం పేరుతో దూషించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితులకు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ క్రింద రూ.9.50 లక్షలు మంజూరయ్యాయి. బాధితులకు ఆ సొమ్ము అందేలా చూడాలని తహసీల్దార్ బీవీ రమణారావును అంజయ్య కోరారు.

నిరుద్యోగులకి నిరుద్యోగ భృతి ఇవ్వాలి


మాట్లాడుతున్న కేవీ పిచ్చయ్య

ముండ్లమూరు(దర్శి): ఉద్యోగం లేని నిరుద్యోగులందరికీ రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఉల్లగల్లు గ్రామంలో డీవైఎఫ్ఐ గ్రామకమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుద్యోగులకి 14 నెలలకు పైగా చంద్రబాబు నిరుద్యోగ భృతి బాకీ ఉన్నాడన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉలగల్లు అధ్యక్షునిగా షేక్ జుబేర్, కార్యదర్శిగా షేక్ బాషా, ఉపాధ్యక్షులుగా దార్ల కుమార్, మధుమంచి ప్రకాష్, షేక్ రహీం, సహాయ కార్యదర్శులుగా టీ వెంకటేశ్వర్లు, పీ శ్రీనుబాబు, షేక్ బాషా ఎన్నికయ్యారు.


ఇళ్ల మధ్య ప్లాస్టిక్ వ్యర్థాలు

ఇదేనా స్వచ్ఛ సంకల్పం?

పుల్లలచెరువు: ప్రభుత్వం ప్రతి మూడో శనివారం స్వచ్ఛ భారత్ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలైతే ఇస్తోందిగానీ ఆచరణలో అమలు కావడం లేదు. పుల్లలచెరువు వైద్యశాల వద్ద దట్టంగా చెట్లు పెరగడంతో క్రిమికీటకాలు వార్డుల్లోకి వస్తున్నాయని రోగులు వాపోతున్నారు. ఆస్పత్రి ఆవరణ చూసి ఇది వైద్యశాలేనా..అనే అనుమానం వచ్చే విధంగా ఉంది. పుల్లలచెరువులోని కమ్మవారిపల్లిలో ఇళ్ల మధ్య చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్లాస్టిక్ పేపర్లు చేరి పారిశుధ్యం అధ్వానంగా ఉంది. నిత్యం దోమలు వస్తుండటంతో అక్కడ నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఇలా..

గోవిందు మృతి పార్టీకి తీరని నష్టం

● ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


చిన గోవిందు (ఫైల్)

కురిచేడు: వైఎస్సార్ పార్టీ నాయకుడు బొరిగొర్ల చిన్న గోవిందు (55) మృతి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్న గోవిందు ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆరోగ్యం క్షీణించి గురువారం రాత్రి ఆయన మృతి చెందారు. ఆ విషయాన్ని తెలుసుకుని శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం పడమర వీరాయపాలెంలోని చిన గోవిందు నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకుడని బూచేపల్లి పేర్కొన్నారు. పడమర వీరాయిపాలెం సర్పంచ్ బొరిగొర్ల శివలక్ష్మి తండ్రి చిన గోవిందు. ఈయన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు. మాజీ ఎంపీటీసీ, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు, పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఎమ్మెల్యే బూచేపల్లి వెంట జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నిమ్మకాయల రాజయ్య, ఎంపీటీసీ తాళ్లూరి ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు సొరెడ్డి నాగిరెడ్డి, సెక్రటరీ ముప్వా శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పోకూరి సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు ఊట్ల పోలయ్య, సోషల్ మీడియా కన్వీనర్ కోలా సంతోష్ కుమార్, ప్రచార కమిటీ అధ్యక్షుడు ఇందూరి సుబ్బారెడ్డి, నాయకులు నుసుం ప్రతాప్‌రెడ్డి, ఆరుద్రారెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, తాటి చెంచయ్య, పాపయ్య, సాదం నాసరయ్య, బొమ్మనబోయిన ఆంజనేయులు ఉన్నారు.


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి

కార్యకర్తకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ

కురిచేడు: మండలంలోని నాంచారపురం గ్రామనికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు జింకా మూర్తెయ్యను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం రాత్రి పరామర్శించారు. అనారోగ్యంతో ఉన్న ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనరు వైవీ సుబ్బయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీధర్, అధికార ప్రతినిధి జి.లింగారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులు సొరెడ్డి నాగిరెడ్డి, అంకె గోపాలకృష్ణ, యూత్ అధ్యక్షుడు కానాల శివారెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, నాయకులు నుసుం ఆరుద్రారెడ్డి, కండె గంగయ్య, ఎన్వీ నాగిరెడ్డి, పెండ్యాల గుర్నాథం ఉన్నారు.


మూర్తెయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

మండల పరిషత్ సమావేశం బహిష్కరణ


సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు

యర్రగొండపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్‌తో పాటు ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం ప్రారంభమైన వెంటనే వారు సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండల అభివృద్ధికి సభ్యులు ఆమోదం తెలిపిన తీర్మానాలకు ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఇప్పటి వరకు అడ్మిన్స్ట్రేషన్ శ్యాంక్షన్ ఇవ్వలేదని, దీంతో మండలం అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. ఎంపీడీవో కూటమి నాయకుడికి వత్తాసు పలుకుతూ ఆయన చెప్పు చేతుల్లో పనిచేస్తున్నాడని, మెజార్టీ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోకుండా ఉండేందుకు ఆమోదం తెలిపిన తీర్మానాలకు అడ్మినిస్ట్రేషన్ శ్యాంక్షన్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ సంవత్సరం జనవరి 10వ తేదీన జరిగిన సమావేశంలో తీర్మానించి ఆమోదించిన 12 అంశాల్లో ఏ ఒక్క అంశాన్ని ఎంపీడీవో అమలు చేయలేదని, ఈ విషయంపై మండల పరిషత్ సమావేశంలో నిలదీస్తామన్న భయంతో ఆయన ఆ తర్వాత జరిగిన సమావేశాలకు హాజరు కాలేదని ఆరోపించారు. కొత్తపల్లి శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు, పిల్లికుంట తండా నుంచి చెం కాలనీకి రోడ్డు వేసేందుకు రూ.5 లక్షలు, కొలుకుల ఎస్సీ పాలెం, మొగుళ్లపల్లె, తమ్మడపల్లె, గోళ్లవిడిపి వైపాలెంలోని ఉట్ల స్తంభాల వీధి, గురిజేపల్లి ఎస్సీ పాలెం, గుర్రపుశాల, ఇజ్రాయిల్‌పేటల్లో తాగునీటి కోసం బోర్లు ఏర్పాటు చేసేందుకు దాదాపు రూ.23 లక్షలు, గంజివారిపల్లె నుంచి సాయిబాబా నగర్‌కు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు, వీరభద్రాపురం జిల్లాపరిషత్ స్కూల్ నుంచి గంజివారిపల్లె రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసేందుకు సమావేశం తీర్మానించిందని, ఆ పనుల్లో ఏ ఒక్కటీ ఇప్పటి వరకు జరగలేదన్నారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులకు ఎంపీడీవో జాప్యం చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని, మండల అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పుల్లలచెరువు: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో ఇందిర అన్నారు. మండలంలోని పీవీపల్లి జెడ్పీ పాఠశాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూను అనుసరించి నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు. పరిశుభ్రమైన ప్రదేశంలో రుచిగా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. ఈ విషయంలో విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే జిల్లా అధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరించారు. విద్యార్థులు రోజూ డ్రెస్ కోడ్ పాటించేలా చర్యలు తీసుకోవాలని, సకాలంలో ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయాలని ఎంఈఓ ఇందిర సూచించారు.


మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అడ్డుకట్ట


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్‌లు

యర్రగొండపాలెం: అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తోందని పలువురు సర్పంచ్‌లు ఆరోపించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని, ఆ నిధులను కూడా పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. 2024–25 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రెండో విడతగా రూ.1,129 కోట్లు స్థానిక సంస్థలకు మంజూరు చేసిందని, ఆ నిధులు విడుదలై దాదాపు 7 నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఆయా పంచాయతీలకు జమ చేయలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులను కూటమి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా సంక్షేమ పథకాలకు వినియోగించుకుందని, దీంతో పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీల్లో మౌలిక వసతులు తాగునీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణ కోసం సర్పంచ్‌లు తమ సొంత నిధులు ఖర్చు పెట్టి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుద చేసి పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, ఏకుల జయమ్మ ముసలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాస్ పద్మావతి, పల్లెపోగు జ్యోతి, పోలేబోయిన పద్మనాయుడు, ఆవుల నారాయణమ్మ, తమ్మినేని సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

డిబేట్‌లో ప్రథమ స్థానం

యర్రగొండపాలెం: సమాచార హక్కు చట్టం ఆవిర్భవించి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలులో ఏర్పాటు చేసిన డిబేట్ పోటీల్లో స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పి.భరత్‌చంద్ర, ఎం.మహేష్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారిని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి.ప్రదీప్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యర్రగొండపాలెం: కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు షేక్ పీరా డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ బోర్డును మరుగున పడేయడం శోచనీయమన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు అన్వర్ బాష, ఆవుల యోగ, పిచ్చిరెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కె.వి.కృష్ణగౌడ్, మన్నె సాంబశివరావు పాల్గొన్నారు.

ధనలక్ష్మి అమ్మ వారికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని బొద్దికూరపాడు శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శ్రీ ధనలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మణిద్వీప వర్ణనతో పాటు తొమ్మిది రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కొబ్బరి కాయలు కొట్టారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ పూజారులు వాసు, రమణయ్య పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ధనలక్ష్మి అమ్మవారు

శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు


పేరంటాళ్లమ్మ చెట్టు


పొంగళ్లు చేస్తున్న మహిళలు

కురిచేడు: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పడమర గంగవరంలో మహిళలు పేరంటాళ్లమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ శివారులో వేంచేసి ఉన్న పేరంటాళ్లమ్మ చెట్టు వద్దకు మహిళలందరూ వెళ్లి పూజలు చేశారు. సామూహికంగా పొంగళ్లు చేసి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం వచ్చినా ఇంతవరకు పైర్లు వేయలేదని, ఇకనైనా కరుణించి సకాలంలో వర్షాలు కురిసి పంటలు సాగు చేసి పండేలా చూడాలని కోరుకున్నారు.

పుట్టిన బిడ్డలకు వెంటనే తల్లిపాలు ఇవ్వాలి

● సీడీపీఓ కమలకుమారి

పెద్దదోర్నాల: పుట్టిన వెంటనే బిడ్డలకు తల్లిపాలు పట్టిస్తే బిడ్డల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ కమలకుమారి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని బీసీ కాలనీ 412 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు అందించడమే బిడ్డకు వేసే మొట్టమొదటి టీకాగా భావించాలని చెప్పారు. ముర్రపాలు తాగితే బిడ్డల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనారోగ్యం పాలు కాకుండా బలంగా తయారవుతారని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారించేందుకు ఆకుకూరలు విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు కార్యకర్తల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. సూపర్‌వైజర్‌లు అంజమ్మ, లక్ష్మీదేవి, కార్యకర్తలు ముంతాజ్, మల్లేశ్వరీదేవి, భాగ్యలక్ష్మి, అమలాదేవి, వెంకటరత్నం, ప్కిస్కిల్లా, నాగమల్లేశ్వరి, సుహాసిని, సుజాత, రూత్, అనూషబాయి, మరియమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ కమలకుమారి

అగ్ని ప్రమాద బాధితుడికి సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అంద చేస్తున్న దాతలు

యర్రగొండపాలెం: పుల్లలచెరువు మండలంలోని కొమరోలు హైవే రోడ్డుపై కూల్ డ్రింక్ షాపు దగ్ధమైన బాధిత కుటుంబానికి శుక్రవారం స్థానిక చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందచేశారు. చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ రూ 5 వేలు, ఎంఈవో పి.ఆంజనేయులు, బాబుల్ నాయక్, అడిపి నాగయ్య, మురళీ కృష్ణ, పబ్బిశెట్టి రవి, మల్లిపెద్ది రవీంద్రబాబు వారికి సహాయం అందచేశారు.

క్షుద్రపూజల కలకలం

కురిచేడు: పంట పొలాల్లో క్షుద్రపూజలంటూ కలకలం రేగింది. గుర్తు తెలియని వ్యక్తులు దర్శి రోడ్డులోని మూలె నర్సింహారెడ్డి పొలంలో మనిషి బొమ్మ ఆకారంలో ముగ్గులు వేసి నిమ్మకాయలు కోసి కొబ్బరి కాయలు కొట్టి పసుపుకుంకుమ చల్లారు. అక్కడ ఒక నీటిబిందె, చీర, లంగా, జాకెట్, ప్యాంట్‌తో పాటు చిన్న కత్తి, కుండను పగలకొట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. రైతులు ఆ వైపు వెళ్లేందుకు భయపడుతున్నారు.

సామూహిక జీవన నైపుణ్యాలు అలవర్చుకోవాలి

పెద్దారవీడు: విద్యార్థులు చిన్న వయసులోనే సామూహిక జీవన నైపుణ్యాలు అలవర్చుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. మండలంలోని రాజంపల్లి సమీప కేంద్రీయ విద్యాలయంలో తృతీయ సోపాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం ఎల్‌టీసీ బీఆర్‌వీకే స్వామి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ నైతిక విలువలు, సేవాభావం, క్రమశిక్షణతో విద్య, దేశభక్తిపై ప్రత్యేక సందేశం ఇచ్చారు. శిబిరం ద్వారా విద్యార్థుల్లో జాతీయ చైతన్యం, సేవా మనోభావం, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులకు తొలి చికిత్స, నైతిక విలువలు, నిబంధనలు, శారీరక కసరత్తులు, పాటలు, గేమ్స్, క్యాంప్ ఫైర్ కార్యాచరణ, సామూహిక చర్చలు, నాయకత్వం నైపుణ్యాల అభివృద్ధి, పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ గుజ్జర్ తెలిపారు. కార్యక్రమంలో చట్లమిట్ల పీహెచ్‌సీ డాక్టర్ అన్నపురెడ్డి శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్